భారత ఎగ్జిమ్ పాలసీ 2009-14

ఒక దేశ ఆర్థికాభివృద్ధిలో ఎగుమతులు, దిగుమతుల పాత్ర ఎంతో కీలకం. అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాలు ఈ ఆవశ్యకతను గుర్తించాయి. ఈ క్రమంలో విదేశీ పెట్టుబడులను రాబట్టడానికి ఎన్నో ఆకర్షణీయ విధానాలకు రూపకల్పన చేసి తమ తమ దేశాల అభివృద్ధికి కృషి చేస్తున్నాయి. భారత్ కూడా ఇదే బాటలో పయనిస్తూ ఎగుమతులు, దిగుమతుల విషయంలో ఎన్నో కొత్త వాణిజ్య విధానాలకు శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా 1990లలో మొదలైన ఆర్థిక సంస్కరణల తర్వాత ఎన్నో సరళీకృత విధానాలను ప్రవేశపెట్టింది. ఎన్నో దేశాలతో ద్వైపాక్షిక ఒప్పందాలు కూడా చేసుకుని వృద్ధి బాటలో పయనిస్తోంది. ఎగ్జిమ్ పాలసీలను ఆకట్టుకునేలా రూపొందిస్తోంది. ఈ నేపథ్యంలో భారత్ ఎగ్జిమ్ పాలసీ -2009-14పై విశ్లేషణ..



అభివృద్ధి చెందుతున్న దేశాలైన భారత్, చైనాలు తమ పారిశ్రామికాభివృద్ధి వ్యూహంలో భాగంగా అనేక విధానాలను అనుసరించాయి. ఈ క్రమంలో 1950లో దిగుమతులకు ప్రత్యామ్నాయ విధానాలను అవలంబించాయి. చైనా 1978లో వాణిజ్యపరంగా సరళీకరణ విధానాలను అనుసరించడం ప్రారంభించింది. దీనికి భిన్నంగా భారత్ 1980లో వాణిజ్య సరళీకరణకు బదులు అంతర్గత నియంత్రణ విధానాల తొలగింపునకు ప్రాధాన్యమిచ్చింది. 1990 మొదట్లో ఏర్పడిన చెల్లింపుల సంక్షోభం కారణంగా భారత్ తన వాణిజ్య విధానంలో సరళీకృత విధానాలకు పెద్దపీట వేసింది. వీటి ద్వారా పోటీతత్వం పెరిగి ఉత్పత్తి యూనిట్లలో ఉత్పాదకత పెరుగుతుందని భావించారు. ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యూటీఓ) నివేదిక ప్రకారం.. ప్రపంచ వస్తు వాణిజ్య వృద్ధి స్థిర ధరల వద్ద 2007లో 6 శాతం ఉండగా 2008లో ఇది కేవలం 2 శాతానికే పరిమితమైంది.

భారత్‌లో ఎగుమతుల వృద్ధి

భారత్‌లో 2007-08 ఆర్థిక సంవత్సరంలో ఎగుమతుల్లో వృద్ధి నమోదైంది. పెట్రోలియం, తయారీ, ప్రాథమిక ఉత్పత్తుల ఎగుమతుల్లో వృద్ధి దీనికి కారణం. ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక సంక్షోభం ప్రభావం భారత ఎగుమతులపైనా పడింది. ఫలితంగా వజ్రాలు, ఆభరణాలు, హ్యాండిక్రాఫ్ట్స్,వ్యవసాయ సంబంధిత ఉత్పత్తులు, ఖనిజాల ఎగుమతులు తగ్గాయి. మరో వైపు దిగుమతులకు సంబంధించి 2008- 09లో పెట్రోలియం ఉత్పత్తుల వాటా మొత్తం పెరిగినప్పటికీ.. మూలధన వస్తు దిగుమతులు తగ్గాయి.

ప్రపంచవ్యాప్తంగా మొత్తం వస్తు ఎగుమతులను పరిశీలించినప్పుడు.. వరుసగా రెండేళ్లు (2005, 2006) భారత్ వాటా 1 శాతం మేర పెరిగింది. 2008లో ఇది 1.1 శాతానికి చేరుకుంది. 2007-08లో సేవల రంగం ఎగుమతుల ద్వారా మన దేశం 90.1 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని అర్జించింది. అయితే ఇదే సమయంలో ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న ఆర్థికసంక్షోభం మన సేవల ఎగుమతులపై చూపిన ప్రభావం తక్కువే. సాఫ్ట్‌వేర్ సర్వీసెస్, ఫైనాన్షియల్ సర్వీసుల ఎగుమతుల్లో మంచి వృద్ధి నమోదు చేసుకుంటే.. రవాణా సేవలు తక్కువ వృద్ధిని సాధించాయి.

రెండో ప్రపంచ యుద్ధం తర్వాత 1970 ముందు వరకు వాణిజ్య సరళీకరణ విధానం అమల్లో ఉండేది. అయితే 70వ దశకం మధ్య భాగం నుంచి అభివృద్ధి చెందిన దేశాలు రక్షిత విధానాలకు ప్రాధాన్య తనివ్వడం ప్రారంభించాయి. ఫలితంగా పలు దేశాల్లో వినియోగదారుల ప్రయోజనాలకు విరుద్ధంగా ధరలు పెరగడం, వస్తువుల నాణ్యత తగ్గడం వంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి. అంతేకాకుండా 'స్వదేశీ ఏకస్వామ్యాల' పెరుగుదలకు దారితీసింది. ప్రపంచవ్యాప్తంగా వనరుల అభిలషణీయ వినియోగానికి కూడా ఈ రక్షిత విధానం అడ్డుగా నిలిచింది. దీంతో 1980, 1990లలో పలు దేశాలు వాణిజ్యపరంగా సరళీకరణ విధానాలను అనుసరించడం ప్రారంభించాయి. దీన్ని అవకాశంగా తీసుకున్న చైనా 1980, 2008 మధ్య కాలంలో ప్రపంచ ఎగుమతుల్లో తన వాటాను 1 నుంచి 5.1 శాతానికి పెంచుకోగలిగింది.

వ్యాపార భాగస్వామ్య దేశాలు:

భారత్‌కు 16 దేశాలు అతి పెద్ద వ్యాపార భాగస్వామ్యులుగా ఉన్నాయి. ఈ దేశాలతో 2003-04 నుంచి 2007- 08 మధ్య కాలంలో భారత వాణిజ్య వృద్ధిలో 3.6 శాతం మేర పెరుగుదల నమోదైంది. ఇందులో అతిపెద్ద వ్యాపార భాగస్వామి అమెరికా. దీని వాటా 1.5 శాతం మేర తగ్గింది. ఇదే స్థాయిలో బ్రిటన్ వాటా 1.6 శాతం, బెల్జియం వాటా 2 శాతం మేర క్షీణించింది. భారత్‌తో రెండో అతిపెద్ద వ్యాపార భాగ

స్వామి చైనా వాటా 2003-04లో మొత్తం వాణిజ్యంలో 4.9 శాతంగా నమోదైంది. కాగా అది 2007-08 నాటికి 9.2 శాతానికి చేరుకుంది. పెట్రోలియం ఉత్పత్తుల ధరల పెరుగుదల ఫలితంగా దిగుమతుల విలువ కూడా పెరిగింది. దీంతోపాటు పెరుగుతున్న రిఫైండ్ పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతుల కారణంగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ), సౌదీ అరేబియాలు ఇటీవల కాలంలో భారత్‌కు మూడు, నాలుగో అతి పెద్ద వ్యాపార భాగస్వామ్య దేశాలుగా అవతరించాయి. స్వాతంత్ర్యానంతరం వాణిజ్యలోటు ఎక్కువగా ఉన్నప్పటికీ.. భారత్ ఇటీవల కాలంలో కొన్ని దేశాలతో వాణిజ్య మిగులు సాధిస్తోంది. 2007-08లో అమెరికా, యూఏఈ, బ్రిటన్, హాంకాంగ్, బెల్జియం, ఇటలీ, బ్రెజిల్‌తో, 2008-09లో అమెరికా, బ్రిటన్, సింగపూర్, బ్రెజిల్‌తో భారత్ మిగులు ఆర్జించింది. సౌదీ అరేబియా, చైనాలతో ఎక్కువగా వాణిజ్యలోటు కనిపిస్తోంది.

దక్షిణ ఆసియా దేశాలతో భారత్ ఒప్పందాలు:

భౌగోళిక, రాజకీయ అవసరాల దృష్ట్యా భూటాన్, నేపాల్‌లు భారత్‌తో వాణిజ్యపరంగా, చట్టపరమైన సంబంధాలను కొనసాగిస్తున్నాయి. భూటాన్, భారత్‌ల మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంలో అన్ని ఉత్పత్తులను చేర్చారు. కానీ నేపాల్, భారత్‌ల మధ్య జరిగిన ఒప్పందంలో రెండు ప్రాంతాలకు చెందిన తయారీ ఉత్పత్తులకు మాత్రమే చోటు కల్పించారు. నేపాల్‌కు విదేశీ పెట్టుబడులు అధిక శాతం భారత్ నుంచే వస్తాయి. దీంతో 2003 తర్వాత రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక పెట్టుబడి ఒప్పందాలకు భారత్ ప్రయత్నిస్తోంది.

భారత్-బంగ్లాదేశ్‌ల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం చర్చల దశలో ఉంది. బంగ్లాదేశ్ మొత్తం దిగుమతుల్లో భారత్ వాటా 15 శాతం. కాగా భారత దిగుమతుల్లో బంగ్లాదేశ్ వాటా కేవలం ఒక శాతమే. 2006లో ఇరు దేశాల మధ్య కుదిరిన ఒప్పందం ఆర్థిక, వాణిజ్య ప్రోత్సాహానికి ప్రాధాన్యతనిచ్చింది. ఇండియా, శ్రీలంకలు డిసెంబర్ 1998లో వస్తు సంబంధిత స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం (Free trade agreement on goods)పై సంతకాలు చేశాయి. దీని ప్రకారం కొన్ని వస్తువులపై త్వరితంగా, మిగతా వస్తువులపై దశల వారీగా దిగుమతి సుంకాలను తగ్గిస్తారు. పన్ను మినహాయింపులో చేర్చని వస్తువులను స్థానిక పరిశ్రమకు సంబంధించి సెన్సిటివ్‌గా పరిగణించవచ్చు. టీ, గార్మెంట్స్ ఉత్పత్తులకు కూడా వార్షిక గరిష్ట కోటాను విధించారు. ఈ ఒప్పందం కారణంగా ఇరు దేశాలు లబ్ధి పొందాయి. 2001-2004 మధ్య కాలంలో ఇరు దేశాల మధ్య వాణిజ్యంలో 15 శాతం పెరుగుదల కనిపించింది. శ్రీలంక ఎగుమతులకు భారత్ మూడో పెద్ద ఆధారిత దేశం.

ఎగుమతులు దిగుమతుల విధానం 2009-2014:

మార్కెట్ విస్తరణ విధానంలో భాగంగా భారత్, దక్షిణ కొరియాల మధ్య 'సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం' కుదిరింది. తద్వారా మన దేశ ఎగుమతులకు మార్కెట్ పరంగా అవకాశాలు పెరుగుతాయి. జనవరి 1, 2010న భారత్ ఆసియాన్ (ASEAN) దేశాలతో వస్తువాణిజ్యానికి సంబంధించి ఒక అవగాహనకు వచ్చింది. భారత వాణిజ్య ఒప్పందాలు లుక్ ఈస్ట్ పాలసీ (LOOK EAST POLICY) దిశగా సాగుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏడాదీ మేడ్ ఇన్ ఇండియా (Made in India) పేరిట ప్రదర్శనలను ఏర్పాటు చేసి తద్వారా భారత్ ఎగుమతులకు డిమాండ్ పెరిగేలా కృషి చేయాలని ఎగ్జిమ్ పాలసీ భావిస్తోంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా పెరిగిన పోటీ వాతావరణం నేపథ్యంలో భారత ఎగుమతిదారులు తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని మెరుగుపరచుకోవడం కోసం ఉత్పత్తి వ్యయాలు తగ్గించుకోవాలని ఈ విధానం సూచిస్తోంది. విదేశీ వాణిజ్య విధానం ముఖ్య లక్షణం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకునే దిశగా ఎగుమతిదార్లను ప్రోత్సహించడం. ఈలక్ష్య సాధన కోసం అవసరమైన సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన మూలధన వస్తువుల దిగుమతులపై ఎటువంటి డ్యూటీని విధించకుండా అనుమతిస్తారు.

ప్రసుత్త విదేశీ వాణిజ్య విధానం ప్రకారం.. పనీతీరు ఆధారంగా (Performance) ఎగుమతిదార్లను స్టేటస్ హోల్డర్స్ (Status holders)గా ప్రభుత్వం గుర్తిస్తుంది. ఎగుమతుల రంగంలో సాంకేతిక పరిజ్ఞానం పెంపుదలకు ఎటువంటి డ్యూటీ లేకుండా మూలధన వస్తువుల దిగుమతులకు స్టేటస్ హోల్డర్స్‌కు అనుమతినిస్తున్నారు. ఎగుమతి రంగంలో మౌలికసౌకర్యాల ఆధునికీకరణకు టౌన్స్ ఆఫ్ ఎక్స్‌పోర్ట్ ఎక్సలెన్స్ (towns of export excellence)ను ఎంపిక చేసి ఆయా పట్టణాల్లో ఏర్పాటయ్యే యూనిట్లకు అనేక ప్రోత్సాహకాలను అందజేస్తున్నారు. చిన్న, మధ్యత రహా పరిశ్రమల అభివృద్ధికి డైరెక్టర్ ఆఫ్ ట్రేడ్ రెమిడీ మెజర్స్ (Directorate of trade remedy measures) ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

ప్రత్యేక ప్రోత్సాహకాలు

ప్రపంచ వాణిజ్యంలో భారత్ వాటాతోపాటు ఉపాధి అవకాశాలను పెంచడానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలను అందజేస్తోంది. మార్కెట్ విస్తరణ (market diversification) దృష్ట్యా కూడా ఈ ప్రోత్సాహకాలను కొనసాగించాలని భావిస్తోంది.

- వివిధ వ్యూహాల ద్వారా వ్యవసాయం, చేనేత వస్త్రాలు, హస్తకళలు, వజ్రాలు-ఆభరణాలు, తోలు, మెరైన్, ఎలక్ట్రానిక్స్-ఐటీ, హార్డ్‌వేర్ తయారీ పరిశ్రమలు, గ్రీన్ ప్రొడక్ట్స్, ఈశాన్య రాష్ట్రాల ఉత్పత్తుల ఎగుమతుల ప్రోత్సాహానికి ప్రభుత్వం చేయూతనిస్తోంది.
- ప్రస్తుత ఆర్థిక అనిశ్చిత పరిస్థితుల దృష్ట్యా అభివృద్ధి చెందిన దేశాలకు సంబంధించి భారత్ ఎగుమతుల వృద్ధి తగ్గింది. ఈ నేపథ్యంలో మార్కెట్ విస్తరణను ఎగుమతి-దిగుమతి విధానం 2009-14 సూచిస్తోంది. లాటిన్ అమెరికా, ఆఫ్రికా, ఆసియా, ఓషీనియా దేశాలతో వాణిజ్య సంబంధాలు మెరుగుపరచుకోవాలి.
- ఫోకస్ మార్కెట్ స్కీమ్ (Focus market scheme) కింద కొత్తగా

26 దేశాలను ఈ విధానం ద్వారా గుర్తించారు.

- ఈ దేశాలలో జరిగే వాణిజ్యానికి సంబంధించి ప్రోత్సాహకాలను 2.5 నుంచి 3 శాతం పెంచారు.
- 'విశేష్ కృషి-గ్రామ్ ఉద్యోగ్ యోజన' ద్వారా వ్యవసాయం, గ్రామీణ పరిశ్రమలకు ప్రోత్సాహం.
- వ్యవసాయ ఎగుమతి జోన్‌ల లో ఈపీసీజీ (EPCG) పథకం కింద మూలధన వస్తువుల దిగుమతికి అవకాశం కల్పించారు.
- చేనేత వస్త్రాల ఎగుమతుల ప్రోత్సాహానికి ప్రత్యేక నిధి ఏర్పాటు చేయడం.

స్వేచ్ఛా వాణిజ్య విధానం-ప్రయోజనాలు:

- స్వేచ్ఛా వాణిజ్య విధానం ఉత్పాదక వనరుల వినియోగానికి దారి తీస్తుంది.
- ఈ విధానం శ్రమ విభజనకు దారితీసి ప్రత్యేకీకరణ ఏర్పడటం ద్వారా ఉత్పత్తి వ్యయం తగ్గుతుంది.
- ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తి సమర్థత పెరుగుతుంది.
- వినియోగదారులు, ఉత్పత్తిదారులు ప్రయోజనం పొందుతారు.
- అవినీతికి అవకాశం తక్కువ. ఏకస్వామ్యాలను నియంత్రించటం వీలవుతుంది.